క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయండి

అల్లిపురం : కల్యాణ మండపం పనులు త్వరితగతిన పూర్తి చేసి వార్డు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆమె అచ్చియ్యమ్మపేటలో గల పీహెచ్‌సీ వద్ద నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.49 లక్షలతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వార్డు అభివృద్ధిలో భాగంగా పీహెచ్‌సీ పనులు పూర్తి చేసి వార్డు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలు ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఆమె వెంట వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, పిల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎకో వైజాగ్‌పై అవగాహన



ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కళాకారులు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని సెబాస్టియన్, బాబుకాలనీ, జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ ప్రాంతాల్లో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డీవీవీఎస్‌ఎస్‌ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా నాట్యమండలి కళాకారులు తడి–పొడి చెత్త, ఎకో వైజాగ్, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, నాటకం స్థానికులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలన్నారు. తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు వార్డు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ అర్జున్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సదస్సును విజయవంతం చేయండి

దాబాగార్డెన్స్ : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 26న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న ఉద్యమ సన్నాహక రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను శుక్రవారం హోటల్ గ్రీన్‌పార్క్ వద్ద గల విద్యుత్ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిటు నాయకుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు విద్యుత్ శాఖలో ఉన్న జేఏసీ చర్చల పేరిట కాలయాపన చేస్తూ విద్యుత్ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పలు సమస్యల పరిష్కారంలో జేఏసీతో తెగ తెంపులు చేసుకుని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు ప్రజల మన్ననలు

జగదాంబ : సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వలంటీర్ల వ్యవస్థ సేవలకు ప్రతిరూపంగా నిలుస్తోందని పలువురు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, పింఛన్లు చిత్తశుద్ధితో అందజేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయంలో బంధువులు, అయినవాళ్లే ఒకరిని ఒకరు పట్టించుకోని సమయంలో వలంటీర్లు ధైర్యంగా వార్డులు, వీధుల్లో తిరుగుతూ సేవలందించి ప్రజలు, లబ్ధిదారుల మన్ననలు అందుకున్నారని అంతా వారిని కొనియాడుతున్నారు.

వలంటీర్లకు వందనం

ఇల్లు కదలకుండానే పింఛన్ అందిస్తున్నారు..



గతంలోలా కాకుండా జగన్‌బాబు మాకు ఇల్లు కదలకుండా ఇంటికే నేరుగా పింఛన్ పంపిస్తున్నారు. పింఛన్ ఇవ్వడానికి వచ్చే వలంటీర్లు ఆప్యాయంగా పలకరిస్తూ, మా బాగోగులపై కూడా ఆరా తీస్తున్నారు. వలంటీర్లు ఇలా చేస్తుంటే ఆనందంగా ఉంది.

–సత్యవేణి, వెలంపేట, 35వ వార్డు.

వలంటీర్లు సేవా తత్పరులు..



వలంటీర్లు చక్కటి సేవలందిస్తున్నారు. కోవిడ్ సమయంలో వారు అందించిన సేవ ఇంకా గుర్తుంది. ఇంట్లో వాళ్లే దగ్గరకు రాని సమయంలో ధైర్యంగా వచ్చి జగనన్న పథకాలు అందించారు. వలంటీర్ల సేవలను ఎంతైనా మెచ్చుకోవచ్చు.

–సంధ్యారాణి, ఒంటరి మహిళ పింఛన్ లబ్ధిదారు, లక్ష్మీనగర్, 35వ వార్డు.

వలంటీర్లకు వందనం చేయాల్సిందే..



కోవిడ్ ఒక పక్క.. మరణాలు మరోపక్క.. ప్రాణ భయంతో అందరు వణికిపోతున్న సమయంలో కూడా వలంటీర్లు మేమున్నాం అంటూ వార్డుల్లోని వీధుల్లో ప్రజల కోసం సేవలు అందించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందించారు. నిజంగా వారి సేవలకు వారికి వందనం చేయాల్సిందే.

–ఇమంది తాతారావు, 35వ వార్డు, ఆర్ఆర్ఎంఆర్ రోడ్డు.

మణిపూర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నాయకులు

సీతమ్మధార : మణిపూర్ మహిళలపై హింసకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మహిళా చేతన, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, ఐద్వా, పీవోడబ్ల్యు సంస్థల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై హింస, అత్యాచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. అల్లర్లపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. విద్యార్థినులను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలకు తెగబడటం, కుకీ మహిళల మీద దాడులు చేసి రెండు వేల మంది సమక్షంలో వివస్త్రలను చేసి, సామూహికంగా అత్యాచారం చేయటం దారుణమన్నారు. నిందితులను తక్షణం శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా చేతన కార్యదర్శి కె.పద్మ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ ఫోరంకు చెందిన వీఎస్ కృష్ణ, ఎం.లక్ష్మి, ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి, ఎస్ఎస్‌రాజు, సంతోష్, ఎల్.జె.నాయుడు, గౌతమ్, శ్రావణ విమలకుమారి, శాంతి, రమణి, అప్పలరాజు, వరలక్ష్మి, అప్పారావు, పలు మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



36వ వార్డులో దివ్యాంగునికి ట్రై స్కూటర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం : ఆర్టీసీ కాంప్లెక్స్ దరి బస్టాప్‌ను మోడరన్ బస్టాండుగా మారుస్తున్న నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ఆటో స్టాండ్ బోర్డును తొలగించమంటున్నారని, తమకు న్యాయం చేయాలని చెప్పి ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం అచ్చియ్యమ్మపేటలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ఆటో స్టాండు లేకుంటే తమ బ్రతుకులు రోడ్డు పాలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో మాట్లాడి ఆటో స్టాండ్ వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ఆటో డ్రైవర్లు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వాటిని అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, ఆదివిష్ణు, బాపు ఆనంద్, వాసుపల్లి నారాయణ, బొడ్డేటి కిషోర్, దూడ అప్పారావు, బోణి దేవ, దేవి, సాగర్, రామరాజు, వాసు, సచివాలయ కన్వీనర్, గృహసారథులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి స్కూటర్ బహూకరణ..

36వ వార్డు జామియా మసీదు వద్ద జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అలాగే నడవలేక ఇబ్బంది పడుతున్న 30వ వార్డు కొత్త జాలారిపేట వాసి దివ్యాంగుడు సురకల వెంకటరావుకు రూ.1.30 లక్షల విలువ గల ట్రై స్కూటర్‌ను ఎమ్మెల్యే కలెక్టర్ సహకారంతో ఉచితంగా కలక్టర్ సహకారంతో అతనికి అందజేశారు. కార్యక్రమంలో 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మజీబ్‌ఖాన్, బొగ్గ శ్యామ్, ఆదివిష్ణు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం

మహారాణిపేట: ఫ్లోరోసిస్‌పై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. రేసవానిపాలెంలోని తన కార్యాలయంలో శుక్రవారం ఫ్లోరోసిస్ నివారణ, నియంత్రణ కార్యక్రమాల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. పారిశుధ్య శాఖ విడుదల చేసిన సమాచారం ద్వారా రాష్ట్రంలో ఫ్లోరోసిస్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించేందుకు తీర్చిదిద్దిన పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సమత, ఇతర వైద్యులు, ఎన్‌సీడీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటైంది. చైర్మన్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు, కార్యదర్శిగా గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ శివప్రసాద్, సభ్యులుగా విద్యాశాఖ ఏడీ జ్యోతి, ప్రాజెక్టు అధికారి సమత తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

దొండపర్తి : సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించిన రోజునే మహిళా సాధికారత సాధ్యమని డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేరీ సుజాత కంటిపూడి పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం గూగుల్ మీట్ ద్వారా 'మహిళా సాధికారత, శిశు సంరక్షణ' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ సమాజంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి మహిళా సాధికారత దిశగా అడుగులు వేయాలని సూచించారు. లింగ సమానత్వాన్ని సాధించకుండా మహిళా సాధికారత సాధ్యపడదని చెప్పారు. ముఖ్యంగా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, మానసిక శ్రేయస్సుకు మహిళల్లో శారీరక సాధికారత కీలక పాత్ర పోషిస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ డివిజనల్ మేనేజర్ ప్రఫుల్‌కుమార్ సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో 'అనూప్' మార్క్

- డివిజనల్ రైల్వే మేనేజర్‌గా విశేష సేవలు



అనూప్‌కుమార్ సత్పతి (పూర్వ డీఆర్‌ఎం)

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో డివిజనల్ రైల్వే మేనేజర్‌గా ఇప్పటి వరకు పనిచేసిన అనూప్‌కుమార్ సత్పతి ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. తనదైన శైలిలో విధులు నిర్వహించి ఒక ప్రత్యేక వ్యక్తిగా ఆయన నిలిచారు. ఎందరో డీఆర్‌ఎంలు చేయలేని, తీసుకోలేని కొన్ని సాహసోపేత నిర్ణయాలను ఈయన తీసుకుని డివిజన్‌లో అధిక శాతం ఉద్యోగులు, నాయకులతో శభాష్ అనిపించుకున్నారు. రైల్వే క్వార్టర్స్, స్థలాలు, ఆస్తులను కాపాడటంలో కీలకంగా వ్యవహరించారు. రైల్వే క్వార్టర్స్, కార్యాలయాలు, వివిధ విభాగాలు, పలు సెక్షన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎప్పటికప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేసేవారు. ఇటీవల జరిగిన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన సమయంలో కూడా వాల్తేర్ డివిజన్ నుంచి పలువురు అధికారులు, సిబ్బందితో కలిసి సుమారు 48 గంటల పాటు ప్రమాద స్థలంలో చేపట్టిన పునరుద్ధరణ చర్యల్లో అనూప్‌కుమార్ సత్పతి పాల్గొన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా జ్ఞానాపురం వైపు అదనంగా(9, 10) మరో రెండు ప్లాట్‌ఫారాల ఏర్పాటు విషయంలో ఈయన చాలా ఒత్తిడి చేసినట్లు తెలిసిందే. ఎన్నో ఏళ్లుగా సాధ్యం కాని అండర్ బ్రిడ్జిని గోపాలపట్నంలో సాధించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో సుమారు 75 కిలోమీటర్లు డబ్లింగ్ పనులు పూర్తి చేశారు. భారతీయ రైల్వేలోనే లోడింగ్‌లో వాల్తేర్ డివిజన్‌ను నంబర్ వన్ స్థానంలో నిలిపి, నూతన రికార్డులు నెలకొల్పారు.

23న విద్యార్థులకు మాస్టర్‌మైండ్స్ పురస్కారాలు

దాబాగార్డెన్స్ : జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ నెల 23న మాస్టర్‌మైండ్స్ విద్యా సంస్థ సత్కరించనుందని ఆ సంస్థ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి తెలిపారు. స్టేట్ సిలబస్ ఎంపీసీ గ్రూప్‌లో 430 మార్కులు పైబడి, బైపీసీ గ్రూప్‌లో 400 మార్కులు పైబడి, ఎంఈసీలో 470 మార్కులు, సీఈసీలో 450 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతిభా పురస్కారాల పేరిట సత్కరించనున్నట్టు చెప్పారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు సీబీఎం కాంపౌండ్, వీఐపీ రోడ్డు, షాపర్స్ స్టాప్ వెనుక గల మాస్టర్‌మైండ్స్ క్యాంపస్‌లో నిర్వహించనున్న ప్రతిభా పురస్కారాలకు ఆధార్ కార్డు, కళాశాల గుర్తింపు కార్డు, జూనియర్ ఇంటర్‌లో సాధించిన మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ)ని తీసుకు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9989893943 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

28న సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మంజూరు లేఖను వరప్రసాద్‌కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట : రాజన్న ఆటోనగర్‌లో పక్కా గృహాలు, ఇతర పథకాలు మంజూరు చేస్తూ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారని రాజన్న ఆటోనగర్ సలహాదారు పి.వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మంజూరు లేఖను కలెక్టర్ అందజేసినట్లు తెలిపారు. ఆనందపురం మండలం కనుమం గ్రామంలో 151.7 ఎకరాల స్థలంలో స్క్రాప్ వర్కర్ల గృహ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 32 కోట్లు మంజూరు చేసింది. ఈ పథకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈనెల 28 ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈ నిర్మాణ బాధ్యతలను ఏపీఐఐసీకి అప్పగించారని రాజన్న ఆటోనగర్ ప్రెసిడెంట్ పి.ఖాజావలీ తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మానసిక ఆస్పత్రి వద్ద మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్ రామిరెడ్డి తదితరులు

ఏయూ క్యాంపస్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని హరితమయంగా తీర్చిదిద్దుతూ, ఆహ్లాదాన్ని పంచేలా మొక్కలు నాటి సంరక్షించనున్నట్టు రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ డి.విజయలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ పి.లోకేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ కె.మాధవీలత, డాక్టర్ టి.ఎస్.ఎన్.రాజు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం పోరాడుతాం

దాబాగార్డెన్స్ : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పోరాడుతామని పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. విశాఖ విచ్చేసిన ఆయన శుక్రవారం నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుందని చెప్పారు.

మర్యాదపూర్వక కలయిక



దాబాగార్డెన్స్: డీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులను జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కార్పొరేటర్ పూర్ణిమకు సత్కారం



కార్పొరేటర్ పూర్ణిమను సత్కరిస్తున్న నేవల్ డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ సభ్యులు

కంచరపాలెం : జ్ఞానాపురం పార్టీ కార్యాలయంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమను శుక్రవారం నేవల్ డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఇటీవల జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా 63 ఓట్లతో ఎన్నికైన ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కాపు సామాజిక వర్గం అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, శ్రీధర్‌లను ప్రశంసించారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కాపులకు పెద్దపీట వేశారన్నారు. రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పలు పదవుల్లో కాపులకు ప్రథమ స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాపు సోదరీమణులకు ప్రతి ఏటా కాపు నేస్తం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారని, కాపులందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడంలో కాపు నాయకులందరూ ప్రముఖ పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు బత్తుల చిరంజీవిరావు, ఎల్.కృష్ణరావు, బీఎస్ నాయుడు, ఎస్.రమణ, జి.శ్రీనివాసరావు, డి.తేజేశ్వరరావు పాల్గొన్నారు,

ఘనంగా బంగారమ్మ ఉత్సవాల చాటింపు



పూజారమ్మతో ఊరేగింపుగా వెళ్తూ చాటింపు వేస్తున్న దృశ్యం




బంగారమ్మకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

దాబాగార్డెన్స్ : దిబ్బలపాలెం, చందకవీధి, పీ అండ్ టీ క్వార్టర్స్ గ్రామదేవత బంగారమ్మ పండగ మహోత్సవాల సందర్భంగా శుక్రవారం చాటింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అమ్మవారి పండగ చాటింపు సందర్భంగా చదునుపట్టు వద్ద పెద్ద ఎత్తున పూజలు చేశారు. అనంతరం గ్రామ పొలిమేర నుంచి పూజారమ్మను జగదాంబ జంక్షన్ సమీపాన గల యల్లమ్మ గుడి, జగదాంబ జంక్షన్, దండుబజార్, పీ అండ్ టీ క్వార్టర్స్, చందకవీధి మీదుగా దిబ్బలపాలెం గ్రామంలో గల చదునుపట్టు వద్దకు మేళతాళాలు.. డప్పు వాయిద్యాలతో ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బంగారమ్మకు జలాభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి దండుబజార్ డౌన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన కళావేదిక ప్రాంగణంలో విజయనగరానికి చెందిన కళాకారులతో బుర్రకథ నిర్వహించారు.

నేడు సత్తమ్మకు పూజలు..

ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటలకు చదునుపట్టు వద్ద సత్తమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం చదునుపట్టు నుంచి బయలుదేరి దండుబజార్, పీ అండ్ టీ క్వార్టర్స్, చందకవీధి, దిబ్బలపాలెం, జగదాంబ జంక్షన్, ప్రకాశరావుపేట, జడ్జి కోర్టు, సింగ్‌హోటల్ జంక్షన్ మీదుగా పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ గుడి వరకు ఊరేగింపుగా వెళ్లి ఉపారం అందజేయనున్నారు. సాయంత్రం 7 గంటలకు కళావేదిక ప్రాంగణంలో రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా జరగనుంది.

పాతనగరం ప్రధాన రోడ్డు విస్తరణకు చర్యలు



పాతనగరం



రద్దీగా లేపాక్షి జంక్షన్

- కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేయనున్న వైనం

దాబాగార్డెన్స్ : పాతనగరం అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఎప్పటి నుంచో జరగాల్సిన రోడ్డు విస్తరణ పనులకు ఇటీవలే జీవీఎంసీ చర్యలు చేపట్టింది. పాతనగరం క్వీన్ విక్టోరియా విగ్రహం నుంచి రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా జగదాంబ జంక్షన్ నుంచి టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డు, టౌన్‌కొత్తరోడ్డు, కురుపాం మార్కెట్ మీదుగా క్వీన్ విక్టోరియా విగ్రహం వరకు చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఈ నెల 25న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆమోదానికి ప్రధానంగా చర్చకు రానుంది. రోడ్డు విస్తరణకు సంబంధించి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఇటీవల నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.

అభివృద్ధి పనులు ఇలా..

- రూ.కోటీ 72 లక్షల 20 వేలతో జగదాంబ జంక్షన్ నుంచి క్వీన్ విక్టోరియా విగ్రహం జంక్షన్ వరకు 60 అడుగుల ప్రతిపాదిత రోడ్డు విస్తరణలో భాగంగా వైజాగ్ ఎంపోరియం నుంచి శ్రీవిశాఖ మెడికల్స్ వరకు ఇరువైపులా వరదనీటి కాలువలు, కాలిబాటలు, డివైడర్ ఏర్పాటుకు కౌన్సిల్ సభ్యుల ఆమోదానికి చర్చకు రానుంది.
- రూ.కోటీ 74 లక్షలతో క్వీన్ విక్టోరియా విగ్రహం వద్ద 60 అడుగుల విస్తరణ, పలు అభివృద్ధి పనులు
- రూ.కోటీ 4 లక్షల 30 వేలతో క్వీన్ విక్టోరియా విగ్రహం నుంచి పాతపోస్టాఫీస్ జంక్షన్ వరకు అభివృద్ధి పనులు
- రూ.కోటీ 41 లక్షల 80 వేలతో టర్నర్ చౌల్ట్రీ నుంచి పూర్ణామార్కెట్ వరకు మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు
- రూ.కోటీ 57 లక్షల 40 వేలతో పూర్ణామార్కెట్ నుంచి ఏవీఎన్ కాలేజీ డౌన్ మెయిన్ రోడ్డు వరకు అభివృద్ధి పనులు
- రూ.కోటీ 72 లక్షల 20 వేలతో టౌన్‌కొత్తరోడ్డు జంక్షన్ నుంచి వైజాగ్ ఎంపోరియం వరకు పలు అభివృద్ధి పనులు
- రూ.కోటీ 92 లక్షల 50 వేలతో ఏవీఎన్ కాలేజ్ డౌన్ రోడ్డు నుంచి టౌన్‌కొత్త రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు జీవీఎంసీ కౌన్సిల్ సభ్యుల ఆమోదానికి చర్చకు రానుంది.

36వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 36వ వార్డు పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ శుక్రవారం వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. వార్డు పరిధి రెల్లివీధి ప్రాంతంలో రూ.5.30 లక్షలతో కల్వర్టు మరమ్మతులు, రూ.4.80 లక్షలతో శబరి నగర్ క్లబ్ మరమ్మతులు, రూ.14 లక్షలతో రెల్లివీధి నూతన కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి, సుపరిపాలన అందిస్తున్నందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాను రెల్లివీధి ప్రాంతంలో పర్యటించినప్పుడు అక్కడి స్థానికులు కమ్యూనిటీ భవన్, సీసీ కల్వర్ట్, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని తన దృష్టికి తీసుకొచ్చారని, స్థానిక సమస్యల కోసం జీవీఎంసీ అధికారులను ఆదేశించడంతో నేడు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, బోని దేవా, బెహర వెంకటరత్నం, కుందేటి సుధాకర్, కడితి రమణమ్మ, కాకి పద్మ, రమణి, కుంచెయ్య, గౌతమ్, కిషోర్, రాంబాబు, చెన్నా శ్రీధర్, కనకమహాలక్ష్మి, సాగర్, రాజు, ముస్లిం నాయకులు రఫీ, లియాఖత్, హనీష్, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.